''నీ పాటతో అందర్నీ ఏడిపిస్తున్నావు. వింటుంటే నాకూ ఏడుపు వచ్చింది. బాగా పాడుతున్నావు''..

ఆడ గొంతుకలోంచి అనుకోని ప్రశంస.

ధర్మభిక్షం ఆశ్చర్యపోయాడు. తన పాతికేళ్ల జీవితంలో ఒక అమ్మాయి తన పాటను మెచ్చుకోవడం అదే మొదటి సారి. ఉబ్బితబ్బిబ్బయి పోయాడు.

భుజం మీది తువ్వాలుతో కళ్లను తుడుచుకుంటూ..

''ఎవరమ్మా నువ్వు? నేనేమీ గొప్పోణ్ని కాదు. పొట్ట నింపుకోవడానికి ఈ స్టేషన్ ముందు కూర్చుని పాటలు పాడుకుంటున్నాను. పుట్టుకతోనే గుడ్డోణ్ని'' అన్నాడు.

ఒక నిమిషం ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు.

వచ్చిన వారు ఎవరో అంచనా వేద్దామని.. మూసుకు పోయిన కళ్లున్న తలను పైకి ఎత్తాడు.

చీకటి తప్ప ఏమీ కనిపించలేదు.

''నీ గొంతులో ఒకలాంటి తపన ఉంది. పాడాలని కాకుండా నీ గొంతులోంచి దుఃఖం దుంకుతున్నట్లుగా నీ పాట ఉంది''..



ఆమె మరోసారి మెచ్చుకుంది.

''అమ్మగారూ! మీకు పాట అంతగా నచ్చితే తోచింది ధర్మం చేయండమ్మా?'' జాలిగా అడిగాడు.

''ఆకలేస్తున్నదా?''.

ధర్మభిక్షం తలొంచుకున్నాడు. ఎప్పుడో ఎండ రాక ముందు తాగిన టీ నీళ్లు మాత్రమే కడుపులో ఉన్నాయన్న విషయం.. అతను ఆమెతో చెప్పలేకపోయాడు.

''నీ పేరేంటి? నీ వాళ్లు ఎవరూ లేరా?''.. అడిగింది.

''నాపేరు ధర్మభిక్షం. ఈ పేరు పెట్టినందుకు అడుక్కుంటున్నానో, అడుక్కుంటున్నందుకు ఈ పేరు వచ్చిందో నాకు తెలీదు. కానీ, నన్నందరూ ఇదే పేరుతో పిలుస్తారు'' అని రెండు క్షణాలు ఆగి..

''నాకు ఎవరూ లేరు. మా అమ్మ పేరు 'కంజిరమ్మ' అని తెలుసు. ఎక్కడుంటుందో, నాకెందుకు దూరంగా ఉందో తెలీదు. నేను ఒంటరిని, కళ్లు లేని కబోదిని''..

ఆమె తన సంచిలో చెయ్యి పెట్టి, ఉదయం ఎవరో ఇచ్చిన రొట్టె ముక్కను తీసి..

''నువ్వు చూడలేనివాడివని అనుకోలేదు. నీ పాట నన్ను మైమరపించింది. అందుకే నీ దగ్గరికి పాట వింటూ వచ్చేశాను. నేనూ నీ లాంటిదాన్నే! ఈ రొట్టె తిను'' అంటూ కింద కూర్చుని ఉన్న అతని తలకు రొట్టెను తగిలించింది.

''ఇద్దరి బతుకులూ ఒకలాంటివేనన్న మాట''.. నెమ్మదిగా అని రొట్టెను అందుకున్నాడు.

''నీకు ఉందా?'' అని అడిగాడు మళ్లీ.

''నా పేరు కుమారి. పుట్టినప్పటి నుంచీ లోకాన్ని చూడని అంధురాలిని. నేనూ పాటలు పాడగలను. కానీ, నీ అంత బాగా కాదులే! మొదటిసారి అనకాపల్లి వచ్చాను. అందరూ ఉన్నా.. నాకు ఎవరూ లేనట్లే! అన్ని అవయవాలు బాగున్న నా వాళ్లంతా నా మీదే ఆధారపడి బతుకుతున్నారు. అందుకే అందర్నీ వదిలేసి నా బతుకు నేను బతుకుదామని గుంటూరు నుంచి వచ్చేశాను''..

అతని పక్కన చతికిల పడి, నెమ్మదిగా చెప్పింది.

ధర్మభిక్షం కొత్త జీవితానికి ఆరోజు నాంది అయింది.

* * *

కుమారి పరిచయం తర్వాత ఆమె కూడా రైల్వే స్టేషన్‌లో చిన్న గోనె సంచిని ముందు పరుచుకుని కూర్చునేది. స్టేషన్‌లోకి వచ్చిపోయేవారు ఆమె వద్ద కూడా చిల్లర పైసలు వేసేవారు. ధర్మభిక్షం గొంతు చించుకుని పాడే పాటలను వింటూ తను కూడా..

''గుడ్డిదాన్ని.. ధర్మం చేయండి బాబయ్యా!'' అంటూ ప్రాధేయపడేది.

తన పక్కన కూర్చుని అడుక్కోవడం వల్ల తనకు పోటీ వచ్చిందని.. కుమారి విషయంలో ధర్మభిక్షం ఎప్పుడూ అనుకోలేదు. ఎవరో చేసే సాయానికి తనెందుకు బాధపడాలి అనుకునేవాడు.

''ఇలా ఎంతకాలం అడుక్కోవాలి. అందర్నీ అలా అడగడం నీకు ఎలా ఉందో తెలీదు. నాకు మాత్రం చాలా ఇబ్బందిగా ఉంది. నాకు ఈ చిల్లర అడుక్కోవడం నుంచి బైటపడాలని ఉంది. నీకా దేముడు మంచి గొంతుకను ఇచ్చాడు. నీ పాటకు రావాల్సింది చిల్లర నాణేలు కాదు.. పచ్చనోట్లు!''.

ధర్మభిక్షం పకపకా నవ్వాడు.

* * *

ఆ సాయంత్రం గంజి తాగుతున్నప్పుడు..

''పాట మన జీవితంగా ఉంది. అందుకే పాటను మనను నడిపించే నావను చేద్దాం!'' చెప్పింది కుమారి.

''అంటే?''.

కుమారి తన ఆలోచన చెప్పింది. మంగళగిరిలో తనకు తెలిసిన ఇద్దరు అంధ కళాకారులున్నారు. వారిని కలుసుకోవాలన్నది ఆమె సూచన. ఆమె చెప్పిన తర్వాత ధర్మభిక్షం చాలా ఆలోచన చేశాడు. ఎన్నాళ్లున్నా పరిస్థితిలో మార్పు వస్తుందన్న నమ్మకం అతనికి కలగడం లేదు. ఒక ప్రయత్నం చేస్తే తప్పేముంది అనిపించింది.

''మంగళగిరి వెళ్దాం'' అన్నాడు.

ఆరోజు ఇద్దరూ కలిసి మంగళగిరి బయల్దేరారు. అనకాపల్లిలో తిరుపతి వెళ్లే రైలు ఎక్కి.. గుంటూరులో దిగారు. రాత్రి పది గంటలవుతున్నది.

చలిగాలి రివ్వున వీస్తూ వణుకు పుట్టిస్తున్నది. ధర్మభిక్షం దుప్పటి కప్పుకొన్నాడు. రైల్లో బాత్రూం పక్కన కూర్చుని.. టిక్కెట్టు లేకుండా ప్రయాణించడం వల్ల శరీరం ఎంతో అలసిపోయింది. ఆకలితో కడుపు నకనకలాడిపోతున్నది.

''ఏదైనా కొని తెస్తా!'' అంటూ, తన చేతి కర్రను నేల మీద కొడుతూ ముందుకు కదిలిపోయింది కుమారి.

రాత్రంతా అక్కడే బెంచీ మీద ముడుచుకుని కూర్చున్న ధర్మభిక్షం ఆకలిని.. ఆ దగ్గర్లో ఉన్న కొళాయి కొంతవరకు తీర్చింది. ఏవో రైళ్లు వస్తున్నాయి, వెళ్తున్నాయి. రాత్రంతా కుమారి కోసం ఎదురు చూస్తునే ఉన్నాడు. భారంగా తెల్లారిపోయింది. ముందు రోజు రాత్రి వెళ్లిన మనిషి ఎందుకు రాలేదో, ఎక్కడికి వెళ్లిపోయిందో అతనికి అర్థం కాలేదు.

ఇంతలో దూరంగా కూనిరాగం వినిపించింది.

''పిల్లలూ, దేముడూ చల్లనివారే.. కల్లకపట మెరగని కరుణామయులే!''..

ఆ పాట కుమారి గొంతులోంచే వస్తున్నది. ధర్మభిక్షానికి ఎక్కడ లేని హుషారు వచ్చేసింది.

కుమారి కర్రను నేలమీద కొడుతూ.. అతను కూర్చున్న బెంచీ దగ్గరికి వచ్చింది.

''రాత్రంతా ఎక్కడికి వెళ్లావు? ఇంత ఆలస్యమైందేమి?'' ఆత్రుతగా అడిగాడు.

అతని ప్రశ్నలకు జవాబు చెప్పకుండా.. తడుముకుంటూ బెంచీకి మరో పక్క కూర్చుని..

''ఆకలి దంచేస్తున్నది. నీ దగ్గర నీళ్ల బాటిలుంది కదా?'' అంటూ తెచ్చిన టిఫిన్ పొట్లం విప్పింది.

''రాత్రి టిఫిను కోసం వెళ్తుంటే పోలీసోడు నన్ను టిక్కెట్టు అడిగాడు. నేను తెల్లమొహం పెట్టాను. టిక్కెట్టు లేకుండా ప్రయాణించామని గుంపులోకి తీసుకెళ్లి.. వారితో నన్ను కలిపేశారు. రాత్రంతా ఉంచి ఉదయం వదిలేశారు'' అంటూ టిఫిన్ అతని ముందుకు తోసింది.

ఆకలితో ఉన్న ధర్మభిక్షం గబగబా తినేశాడు.

''నిన్న పోలీసోళ్లు పట్టుకున్న గుంపులో మనలాంటి కళ్లు లేని ఇద్దరు ఆడోళ్లు ఉన్నారు. అంధుల్ని పోషించే అనాథాశ్రమం హైద్రాబాద్‌లో ఉందని ఎవరో చెబితే అక్కడికి వెళ్తున్నారట''.

ధర్మభిక్షం వెంటనే..

''కుమారీ! నువ్వు వాళ్లిద్దర్నీ తీసుకుని రా! మనతో ఉంచుకుందాం. కలిసే బతుకుదాం. మనం అనుకున్న పనికి ఉపయోగపడతారు. వెంటనే వెళ్లు!'' అన్నాడు.

కుమారి కర్రను చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయింది. అరగంట తర్వాత ఇద్దరు ఆడవాళ్లను తనతో తీసుకుని వచ్చింది. వారి పేర్లు.. పాపమ్మ, బుజ్జి.

''మీరెక్కడికీ వెళ్లొద్దు. కలో గంజో తాగి అందరం కలిసే బతుకుదాం. పాటలు పాడటం పెద్ద కష్టం కాదు. సులభంగా నేర్చుకోవచ్చు'' అంటూ ధర్మభిక్షం వారితో ఆప్యాయంగా మాట్లాడాడు.

కుటుంబ సభ్యులతో కలిసిపోయినంత ఆనందపడిపోయారు వారిద్దరు. ఆరోజు అందరూ కలిసి గుంటూరు నుంచి మంగళగిరి బయల్దేరారు. కుమారికి ఆ ప్రాంతంతో పరిచయం ఉండటం వల్ల తబలా వాయించే వీరేసు, ఆర్గాన్ పలికించే దేముడుబాబును కలుసుకున్నారు. రెండురోజులు మంగళగిరిలోనే ఉండిపోయారు. వారిద్దరు కూడా పుట్టుకతోనే అంధులు. తమ వాళ్లు ఎవరూ పట్టించుకోక పోవడంతో.. ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్నారు.

ఎవరి బతుకులు వారు బతకడం కన్నా.. అందరూ కలిసి బతకాలన్న నిశ్చయానికి వచ్చారు.

తామంతా కలిసి పాటలు పాడే ఓ బృందాన్ని ఏర్పాటు చేయాలని అనుకున్నారు.

మంచి గొంతుక కలిగిన ధర్మభిక్షం చేసిన ఆ ప్రతిపాదనను వారంతా అంగీకరించారు. ఎవరి మీదా ఆధారపడకుండా, భిక్షాటన జోలికి పోకుండా తమ కళను అందరికీ తెలియజేయడం ద్వారా జీవించాలని అనుకున్నారు. ఎవరికీ కళ్లు లేకపోయినా.. ఒకే మార్గంలో పయనించాలని కలిసికట్టుగా నిశ్చయించుకున్నారు.

మంగళగిరి నుంచి వారి ప్రయాణం మొదలైంది.

* * *